360)ముఖారి

ప॥ దేవ నీవు గల్పించినతెరవు లివి । నీవారైనవారినేరుపు లివి ॥

చ॥ పరమశాంతునకు బాపము రాదు । విరతిగలవానికి వెరపు లేదు ।
గురుసేవారతునకు గోపము రాదు । ధర సత్యనిరతునకు దప్పు లేదు ॥

చ॥ పుట్టుబ్రహ్మచారికి బుద్ధి చెడదు । అట్టె ఆసలేనివారికి అలపు లేదు ।
తొట్టినసుజ్ఞానికి దుఃఖము లేదు । గట్టియైనమౌనికి కలహమే లేదు ॥

చ॥ సమచిత్తునకును చంచలము గాదు । విమలాచారునకు వెలితి లేదు ।
నెమకి శ్రీవేంకటేశ నీదాసులై కొల్చి । భ్రమయనివానికి భారము లేదు ॥